క్లుప్తంగా

ముదిరాజ్‌లు ఐక్యంగా ఎదగాలి



నారాయణపేట రూరల్ : ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో ఎదగాలని, అందుకోసం శాయశక్తులా కృషిచేస్తానని సంఘం జిల్లా నూతన అధ్యక్షుడు సరాఫ్ నాగరాజు అన్నారు. మంగళవారం ఆయనను ఆ సంఘానికి చెందిన మద్దూర్, దామరగిద్ద నాయకులు సన్మానించారు. హన్మంతు, శేఖర్, శ్రీనివాస్, రాములు, అశోక్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

నారాయణపేట రూరల్ : దామరగిద్దలోని రేయిన్‌బో పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు మంగళవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు అందించారు. జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ అనుమతి లేకుండా ఆదివారం విద్యార్థులను విహారయాత్రకు తీసుకుని వెళ్లి, తిరిగి వారిని ఇళ్లకు చేర్చే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. ఈ క్రమంలోనే ఉడ్మల్‌గిద్దకు చెందిన ఐశ్వర్య, అదేవిధంగా తీసుకువెళ్లడానికి వచ్చిన ఆమె మేనమామ రోడ్డుప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారన్నారు. విషయంపై డీఈఓ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మహేష్, బాలరాజు, మల్లేష్, మారుతి, ఆనంద్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అమరచింత: అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశామని ఆత్మకూర్ ఏఎస్‌ఐ బీచుపల్లి తెలిపారు. మండలంలోని పిన్నంచర్ల శివారులో ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆపి అనుమతి పత్రాలు పరిశీలించగా.. ప్రభుత్వ అనుమతులు లేకుండా చిన్నచింతకుంట మండలం అల్లీపురం ఊకచెట్టు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్ మన్యంబాబుపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

తాగునీటి కొరత నివారించేందుకు చర్యలు

అమరచింత: పట్టణంలో వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. రెండు రోజుల కిందట బీసీ కాలనీలో ఉన్న సోర్స్ బోరు రిపేరు కావడంతో హుటాహుటిన వాటికి మరమ్మతు చేయించి తాగునీటి సరఫరాను మంగళవారం పునరుద్ధరించారు. ఈమేరకు మున్సిపల్ వాటర్‌మెన్లతో కలిసి పట్టణంలో ఆయా వార్డుల్లో ఉన్న తాగునీటి సోర్స్ బోర్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని పది వార్డుల్లో మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించడమే కాకుండా, పట్టణంలో మున్సిపాలిటీకి చెందిన 16 తాగునీటి సోర్స్ బోర్ల ద్వార క్రమం తప్పకుండా తాగునీటిని అందిస్తున్నామన్నారు. ఆయా వార్డులో తాగునీటి ఇబ్బందులు కలిగితే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. అదే విధంగా పట్టణంలో నూతనంగా సీసీ రహదారులు నిర్మిస్తున్నామని, కొత్తగా ఎవరైన తాగునీటి కోసం వ్యక్తిగత కుళాయిలు అవసరం అనుకుంటే దరకాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవాలి

అమరచింత: ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వ కుట్రల నుంచి రక్షించుకోవాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి అబ్రహం కోరారు. మండల కేంద్రంలో మంగళవారం సీపీఐ నాయకులతో కలిసి వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 26, 27 తేదీల్లో కరీంనగర్‌లో రాష్ట్ర విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లుగా ఉపాధి హామీ చట్టం దేశంలో అమలవుతూ పేదల కడుపు నింపుతోందన్నారు. యూపీఏ ప్రభుత్వంలో కమ్యూనిస్టు పార్టీలు పోరాడి దీన్ని సాధించారని గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వం పథకంలో అవినీతి జరుగుతోందనే వంకతో ప్రతి ఏటా నిధులను తగ్గిస్తూ ఎత్తివేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. గత బడ్జెట్‌లో రూ.90వేల కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.60 వేల కోట్లకు తగ్గించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఉపాధి కూలీలకు రోజువారి కూలి రూ.600, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు రథోత్సవం

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని కోడూర్ వరదరాజులస్వామి ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. ప్రతి ఏడాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలో వరదరాజులస్వామి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా స్వామివారు వెలసిన ఆలయాన్ని అత్యంత సుందరంగా రంగురంగుల విద్యుద్దీపాలతో వెలుగొందుతోంది. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి రథోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తారు. ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్ పరిశీలించారు.

పాఠశాలల్లో ఉగాది వేడుకలు



నాచారంలో పచ్చడి పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు



బసిరెడ్డిపల్లిలో..

నారాయణపేట రూరల్ : బసిరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఉగాది వేడుకలను నిర్వహించారు. హెచ్‌ఎం శేర్‌కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పచ్చడి తయారీని విద్యార్థులకు నేర్పించారు. అనంతరం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మౌనిక, అంగన్‌వాడీ సిబ్బంది హేమలత, చెన్నమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.

కవి సమ్మేళనం

నారాయణపేట టౌన్ : ఉగాదిని పురస్కరించుకుని జిల్లాకేంద్రంలో భావ సమైక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం కవి సమ్మేళనం నిర్వహించారు. అధ్యక్షుడు జి.కుర్మన్న, కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి సంగ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: నాచారం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివేకానంద సామాజిక సేవా సంస్థ రాష్ట్ర ప్రచారక్ కృష్ణస్వామి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు, పండుగల విశిష్టతను వివరించారు. అనంతరం పాఠశాలలో ఉగాది పచ్చడి చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్‌ఎం మధు, ఉపాధ్యాయులు రాములు, అన్నపూర్ణ, భీమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలోని వెంకటసాయి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో కరస్పాండెంట్ చెన్నారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్వ: ప్రతిభ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ శ్రీజేష్, కరస్పాండెంట్ హన్మంతురెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మరికల్‌లో..



నర్వలో సాంప్రదాయ వస్త్రాధారణలో

భక్తులకు ఏటా అన్నదానం



శ్రీశైలం సమీపంలో అన్నదానం చేస్తున్న గుడెబల్లూర్ గ్రామస్తులు

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ గ్రామస్తులు శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే భక్తులకు ఏటా ఉచితంగా అన్నదానం చేస్తున్నారు. అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న అనే మాటను నిజం చేస్తూ పదేళ్లుగా ఉగాది సందర్భంగా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దాదాపు పదిహేను రోజుల పాటు ఉగాది వరకు అన్నదానం చేపడుతున్నారు. అందుకోసం నెల రోజుల ముందే గ్రామంలోని ప్రజలందరూ కుల, మతాలకు అతీతంగా అన్నదానానికి కావాల్సి సామగ్రిని సమకూరుస్తారు. ఓ ప్రత్యేక వాహనంలో 15 రోజుల ముందే శ్రీశైలం సమీపంలోని మహిశాసురమర్ధిని ఆలయానికి దగ్గరలో ఓ క్యాంపు ఏర్పాటు చేసుకుంటారు. ఈ సారి కూడా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వంటలు వండడం దగ్గర నుంచి ప్రతీ పని కలిసిమెలిసి చేస్తున్నారు. గ్రామస్తులు చేస్తున్న కార్యక్రమానికి నేరడగం మఠం పీఠాధిపతి శ్రీ పంచమసిద్ధలింగ మహాస్వామి తమ వంతుగా సహకారం అందిస్తున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నారాయణపేట రూరల్ : జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలలో మంగళవారం అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర సరిహద్దులోని కాలబెలగుంది క్షేత్రం, పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం, సింగార్‌బేస్ శివలింగేశ్వర స్వామి ఆలయం, మహంకాళివీధి శివాలయం, తాయమ్మగుడితో పాటు ఎక్లాస్‌పూర్ తిమ్మప్ప తదితర ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. అన్నదానం చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, మెప్మా సిబ్బంది, వీరశైవ సమాజం పెద్దలు పాల్గొన్నారు.

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలో మంగళవారం అమావాస్య సందర్భంగా గౌడుగుగేరి ఆంజనేయ స్వామికి ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా సాయివిజయ్ కాలనీలోని మందిరంలో హనుమాన్ మాలధారులు స్వామికి సింధూరలేపనం, పుష్పాలంకరణ చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. యాద్గీర్ రోడ్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో అర్చకులు పూజలు నిర్వహించారు. అన్నదానం చేపట్టారు.



ప్రత్యేక అలంకరణలో కాలబెలగుందీశ్వరుడు..

దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నారాయణ, సభ్యులు శరణప్ప, బస్వంత్‌రాజ్, అర్చకుడు శరణయ్యస్వామి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఎంపీపీ నర్సప్ప, జెడ్పీటీసీ లావణ్య, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి వివిధ గ్రామాల బీఆర్‌ఎస్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

24న పశువుల సంత వేలం

దేవరకద్ర: పశువుల సంత, గొర్రెలు, మేకల సంత, తైబజార్ కూరగాయల సంతకు సంబంధించి వేలం పాట ఈనెల 24వ తేదీ శుక్రవారం ఉదయం 10:30గంటలకు గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఈఓ సీత్యానాయక్, సర్పంచ్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశువుల సంత వేలంలో పాల్గొనే వారు రూ.3లక్షల డీడీని గ్రామ పంచాయతీ పేరు ఎస్‌బీఐలో చెల్లుబాటు అయ్యేలా తీసి 23వ తేదీ సాయంత్రం 5గంటలలోపు గ్రామ పంచాయతీలో ఇవ్వాలని కోరారు. అలాగే తైబజార్ కూరగాయల సంతకు రూ.1.50లక్షల డీడీ, గొర్రెలు, మేకల సంతకు రూ.2లక్షల డీడీ తీసి అందజేయాలన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



చెక్కులు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

- నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని పలు అభివృద్ధి పనులకు రూ.కోటి నిధులు మంజూరు చేసినట్లు నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని చంద్రాస్‌పల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మండలంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులు, కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోయిలకొండలో నూతన గ్రంథాలయ నిర్మాణానికి రూ.60లక్షలు, ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి 40లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ నిరూపరాణి, సర్పంచ్‌లు ఆంజనేయులు, గోపాల్, నాయకులు భీంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్యాం సుందర్, రాజవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎఫ్‌ఐఆర్ నమోదులో జాగ్రత్తలు పాటించాలి

నారాయణపేట రూరల్: పీఎస్‌లలో వచ్చే ఫిర్యాదులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని ఐటీ కోర్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లాలోని అన్ని పీఎస్‌లలో టెక్ టీమ్, స్టేషన్ రైటర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒకరూ తన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, కేసుల విషయంలో టెక్నికల్ విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సాంకేతికతను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉపయోగించుకోవాలన్నారు. నేరం జరిగిన స్థలంలో లాంగి ట్యూడ్, లాటిట్యూడ్ విధిగా సీడీఎఫ్ ఫామ్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి అంశాన్ని తప్పులు దొర్లకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్క సిబ్బందికి సీసీటీఎన్ఎస్‌పై అవగాహన ఉండాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా పాత నేరస్తులను గుర్తించాలని, పీఎస్‌లో జరిగే ప్రతి విషయాన్ని ఎస్‌హెచ్‌ఓ దృష్టికి తీసుకురావాలన్నారు.

గుణాత్మక విద్య అందించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కేంద్రీయ విద్యాలయం ద్వారా విద్యార్థులకు గుణాత్మక విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. మంగళవారం ఎనుగొండలోని కేంద్రీయ విద్యాలయంలో మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. 2021–22 సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో విద్యార్థులు సాధించిన ఫలితాలు, పాఠశాలలో మౌలిక సదుపాయాలు, సిలబస్ ఇతర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. పదో తరగతి, ఇంటర్‌లో విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణులయ్యారని, పాఠశాలకు అప్రోచ్ రహదారి కావాలని ప్రిన్సిపాల్ దశరథ్‌రామ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఏప్రిల్ మొదటి వారంలో మరోసారి పాఠశాలను సందర్శిస్తానని కలెక్టర్ తెలిపారు.

కో కన్వీనర్‌గా నరేష్

కోస్గి: బీజేపీ ఓబీసీ మోర్చా అసెంబ్లీ కో కన్వీనర్‌గా కోస్గి పట్టణానికి చెందిన తాండ్ర నరేష్‌ను నియమించారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రకటించారు. ఈ సందర్భంగా నరేష్ పార్టీ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. నరేష్ నియామకంపై నియోజకవర్గ కో కన్వీనర్ కోటకొండ రాము, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న ప్రచారం



నారాయణపేట టౌన్ : పేటలో టీడీపీ ప్రచారం కొనసాగుతోంది. నియోజక వర్గ కో–ఆర్డినేటర్ వినయ్ మిత్ర యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని బాహర్‌పేట, మడి, పళ్ల కాలనీల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, శివకుమార్, భాస్కర్‌రెడ్డి, సత్యానారాయణ గౌడ్, ఆవుటి వీరన్న, కిష్టప్ప, బలిజ వీరన్న, బన్నప్ప స్వామి గోపి పాల్గొన్నారు.

జల్దిబిందె ఉత్సవాలు



దామరగిద్ద: మండలంలోని యత్నస్‌పల్లిలో బుధవారం ఆంజనేయ స్వామి జాతర ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, జల్దిబిందె ఉత్సవాల నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ దేవిక, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు శక్తి పీఠంలో వేడుకలు

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని శ్రీ సంత్ మత మూల మహా సంస్థానం, శక్తిపీఠం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించనున్నారు. శక్తి పీఠం వ్యవస్థాపకులు స్వామిజీ శాంతానంద్ పురోహిత్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రేవంత్‌రెడ్డి చొరవతో బోరు ఏర్పాటు



పాదయాత్రలో మాట్లాడుతున్న నాయకులు

కోస్గి: మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'హాథ్ సే హాథ్ జోడో' పాదయాత్రకు మద్దతుగా నాయకులు తోగాపూర్‌లో మంగళవారం యాత్ర చేపట్టారు. గ్రామంలో నీటి సమస్యపై స్థానికులు వారికి విన్నవించారు. దీంతో వారు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని సంప్రదించగా స్పందించారు. వెంటనే బోరు వేయాలని అవసరమైన ఖర్చులు చెల్లిస్తానని తెలిపారు. దీంతో స్థానిక నాయకులు అప్పటికప్పుడు బోరు వేయించారు. సమాచారం అందుకున్న మిషన్ భగీరథ అధికారులు గ్రామానికి చేరుకొని త్వరలోనే నీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కాగా ఇంతకాలం నీటి సమస్యను పట్టించుకోని అధికారుల తీరును గ్రామస్తులు బహిరంగంగానే విమర్శించారు. ఆదివిధంగా రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తోగాపూర్‌లో సాగిన యాత్రలో టీపీసీసీ సభ్యులు వార్ల విజయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనచైతన్య యాత్ర పోస్టర్ విడుదల

మక్తల్: సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి నిర్వహించే జన చైతన్య యాత్ర వాల్ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి యాత్రను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ఆంజనేయులు, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: సీపీఎం చేపట్టిన జనచైతన్యయాత్ర పోస్టర్‌ను ఆ పార్టీ నాయకులు అశోక్, అలీ, నరహరి, భరత్‌కుమార్ తదితరులు మంగళవారం మద్దూరులో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బీజేపీ మతోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. 27న నారాయణపేటకు చేరుతుందన్నారు. రైతులు, కూలీలు, కార్మికులు, హాజరై విజయవంతం చేయాలని కోరారు.



పోస్టర్‌లతో నాయకులు

ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపు సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న నాయకులు

నారాయణపేట రూరల్ : తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏవీఎన్‌రెడ్డి విజయంపై హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులకు, కోటకొండ, బొమ్మన్‌పాడు తదితర హైస్కూల్ టీచర్లకు మిఠాయిలు పంపిణీ చేసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా సెక్రెటరీ నర్సింహ, ట్రెజరర్ కిశోర్, హెచ్‌ఎంలు రవి కుమార్, నాగార్జున్‌రెడ్డి, నాయకులు కుర్మయ్య, విశ్వనాథ్‌రెడ్డి, శంకర్‌నాయక్, నాగేష్ పాల్గొన్నారు.

మక్తల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి గెలుపొందడంపై మంగళవారం పట్టణంలో తపస్ ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లో సంబరాలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహ, గౌరవ అధ్యక్షుడు భీమ్‌రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మక్తల్ తపస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్ కృష్ణారెడ్డి, నరసింహ, నాయకులు భీంరెడ్డి, రవీందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ఊట్కూర్: మండలంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో మంగళవారం ఘనంగా వార్షికోత్సవం నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులల్లో వేడుకలు నిర్వహించడం ఉపాధ్యాయుల పనితీరుకు నిదర్శనమని కొనియాడారు. అదేవిధంగా కొల్లూర్‌లోని గుడ్ షేఫర్డ్ పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

అదనపు సమయం ఇవ్వండి



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కోస్గి: రంజాన్ మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో హోటళ్లు, టీ స్టాల్స్, ఇతర దుకాణాలు నడిపేందుకు అదనపు సమయం అనుమతి ఇవ్వాలని కోరుతూ మంగళవారం ఎంఐఎం నాయకులు సీఐ జనార్దన్‌కు వినతి పత్రం అందజేశారు. నెల రోజుల పాటు రాత్రి సమయంలో వ్యాపారాలకు ప్రత్యేక వెసులుబాటు కల్పించాలని కోరారు. మండల అధ్యక్షుడు అంజద్ ఖాన్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

కృష్ణా: మండల సరిహద్దులోని ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద మంగళవారం గోవా మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో ఓ వాహనంలో 8 బాటిళ్ల మద్యం లభించిందని ఎక్సైజ్ ఎస్‌ఐ సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రోజూ వాహనాల తనిఖీ ఉంటుందని, అక్రమంగా మద్యం రవాణ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. కానిస్టేబుల్ జయరాంనాయక్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన మద్యం బాటిళ్లతో పోలీసులు

విద్యార్థుల సమయానుగుణంగా బస్సులు నడపాలి

నారాయణపేట రూరల్ : విద్యాసంస్థల వేళలకు తగినట్లు ఆర్టీసీ బస్సులను నడిపించాలని ఏబీవీపీ పేట కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఒంటిపూట బడుల నిర్వహణ నేపథ్యంలో చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధాన రహదారిపై గ్రామాలు కాకుండా మిగతా వాటికి ఒకే బస్సు ఉండటంతో మధ్యాహ్న భోజనం చేయకుండానే విద్యార్థులు పరిగెత్తుకుంటూ బస్సుల కోసం వస్తున్నారని వాపోయారు. ముఖ్యంగా అమీన్‌పూర్, జలాల్‌పూర్, వత్తుగుండ్ల, నిడుదుర్తి, బోయిన్‌పల్లి, కోటకొండ రూట్లపై దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకున్న ప్రీ స్కూల్ మేళా



ప్రీ స్కూల్ మేళాలో పాల్గొన్న చిన్నారులు

మాగనూర్: మందిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ప్రీ స్కూల్ మేళా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆట వస్తువులను ప్రదర్శించారు. నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంజమ్మ, పాఠశాల హెచ్‌ఎం తిమ్మన్న, అంగన్‌వాడీ టీచర్లు మాధురి, సుధారాణి, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.